# సాక్షి నిర్మల్

మంగళవారం । 23 । సెప్టెంబర్ । 2025

I




## ఉర్రూతలూగించే పాటలు

రెండు దశాబ్దాలుగా బతుకమ్మ పాటలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. పాటల రచనలు, చిత్రీకరణతో ఇప్పుడు బతుకమ్మ వేడుకల్లో ఊరూరా మార్మోగుతున్నాయి. IIలో▸



## కొలువుదీరిన దుర్గమ్మ

జిల్లావ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మండపాల్లో అమ్మవారిని ప్రతిష్ఠించి మొదటి రోజు వివిధ అలంకరణలు చేశారు. IIIలో▸

గరిష్టం/కనిష్టం
32.2 /24.4

## వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. సాయంత్రం అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

• ఎస్పీ జానకీషర్మిల



అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ

నిర్మల్‌టౌన్: అర్జీదారుల సమస్యను పోలీస్ అధికారులు వెంటనే పరిష్కరించాలని, సామాన్యులకు అండగా ఉండాలని ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలు తెలుసుకుని సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సామాన్యులకు అండగా ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన పోలీసు వ్యవస్థను జిల్లా ప్రజలకు అందించడమే లక్ష్యమన్నారు.

### ఆరోగ్య కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రనాయక్

నిర్మల్‌చైన్‌గేట్: ఆరోగ్య కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రజా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై సోమవారం సమీక్ష చేశారు. ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సాధించాలన్నారు. ఈమేరకు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్, కార్యక్రమం నిర్వహణ అధికారులు డాక్టర్ రాజా రమేశ్, నయనారెడ్డి, ఆశిష్‌రెడ్డి, సౌమ్య, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి రవీందర్, డీపీవో రాంచందర్ పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేకు రేషన్ డీలర్ల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు

నిర్మల్‌చైన్‌గేట్: తమ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం నిర్మల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి జిల్లా రేషన్ డీలర్లు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ ఐదు నెలల కమీషన్ చెల్లించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. డీలర్లకు రూ.5 వేల గౌరవ వేతనంతోపాటు క్వింటాల్‌కు రూ.300 కమీషన్ ఇప్పించాలని కోరారు.

### యూరియా కోసం రాస్తారోకో



రోడ్డు పై బైఠాయించిన రైతులు

కడెం: రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేదు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు మండల కేంద్రంలోని పీఏసీఎస్‌కు యూరియా కోసం సోమవారం వచ్చారు. యూరియా లేకపోవడంతో నిర్మల్–మంచిర్యాల ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. యూరియా కోసం వెళ్తే సీఈవో రాజేందర్ తనను బయటకు గెంటేశాడని చిట్యాల్‌కు చెందిన ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

### పట్టణ అభివృద్ధికి నిధులు

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. పట్టణ అభివృద్ధి పనులకు రూ.15 కోట్లు, మురుగునీటి శుద్ధి కేంద్రాలు(ఎస్టీపీ ప్లాంట్లు) ఏర్పాటుకు రూ.42 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. పట్టణంలో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ నిధులు వినియోగించనున్నట్లు వెల్లడించారు. దసరా అనంతరం టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ..



గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బతుకమ్మ ఎత్తుకున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

• భైంసాలో ఘనంగా సద్దుల బతుకమ్మ
• ఆడిపాడిన మహిళలు

భైంసాటౌన్: పట్టణంలో సోమవారం సద్దుల బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు ఉదయం నుంచే తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. సాయంత్రం ఆయా కాలనీల నుంచి మహిళలు, యువతులు బతుకమ్మ పాటలకు కోలాటాలతో నృత్యాలు చేస్తూ బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. ప్రధాన రహదారి మీదుగా స్థానిక గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. అక్కడ మున్నూరుకాపు మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమంలో ఎమ్మెల్యే రామారావుపటేల్ పాల్గొని బతుకమ్మ ఎత్తుకుని నృత్యం చేశారు. మహిళలు, యువతులు భారీగా తరలిరాగా, ప్రాజెక్టు వద్ద బతుకమ్మలను ఉంచి ఆడిపాడారు. డీజే పాటలకు నృత్యాలు చేశారు. పొద్దుపోయాక బతుకమ్మలను ప్రాజెక్టు నీటిలో నిమజ్జనం చేశారు. పోయిరా గౌరమ్మ పోయిరా అంటూ సాగనంపారు. సత్తుపిండి వాయినం ఇచ్చిపుచ్చుకున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



బతుకమ్మలతో చిన్నారులు..



వేడుకల వద్ద ఫొటోలు దిగుతూ..



నిమజ్జనానికి తీసుకెళ్తున్న మహిళలు



పోయిరా గౌరమ్మ.. పోయిరావమ్మా..

### ట్రిపుల్‌ఐటీలో వేడుకలు



బాసర: బాసర ట్రిపుల్ ఐటీలో సోమవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చారు. అనంతరం ఆడిపాడారు. డీజే పాటలకు స్టెప్పులేశారు. అంతకుముందు ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ మాట్లాడుతూ బతుకమ్మను ఏవిధంగా అందంగా పేర్చుతామో విద్యార్థులు తమ జీవితాలను కూడా అంతే అందంగా నిర్మించుకోవాలని సూచించారు. బతుకమ్మ పేర్చిన అధ్యాపకులు, విద్యార్థులకు బహుమతులు అందించారు.

# బతుకమ్మ ఉత్సవాలు | ఘనంగా నిర్వహించాలి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బతుకమ్మ పండుగ నిర్వహణపై సోమవారం సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు తమతమ కార్యాలయాల్లో సంప్రదాయబద్ధంగా బతుకమ్మ పండుగ నిర్వహించాలని సూచించారు. సద్దుల బతుకమ్మ రోజున ఊరేగింపులో అందరూ భాగస్వాములు కావాలన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయాలన్నారు. చెరువుల వద్ద బతుకమ్మ నిమజ్జనం ప్రాంతాల్లో లైటింగ్, పారిశుద్ధ్యం, భద్రతా చర్యలు మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సద్దుల బతుకమ్మ నిర్వహించేందుకు ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'పోషణ మాసం' పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఆర్డీవో రత్నకళ్యాణి, డీఆర్డీవో విజయలక్ష్మి, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, డీపీవో శ్రీనివాస్, డీఈవో భోజన్న, డీపీఆర్వో విష్ణువర్ధన్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, డీఈ హరిభువన్, సీడీపీవో సరిత, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

**ఈవీఎం గోదాం పరిశీలన**

కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎంల గోదాంను కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం పరిశీలించారు. గోదాంలో భద్రపరచిన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను తనిఖీ చేసి సంబంధిత రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భద్రతా ఏర్పాట్లు మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సర్ఫరాజ్, సిబ్బంది రాజశ్రీ, పార్టీల నేతలు ఉన్నారు.

# యూరియా కొరత తీర్చండి

నిర్మల్‌చైన్‌గేట్: యూరియా కొరత తీర్చాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నందిరామయ్య కోరారు. యూరియా కొరత, పత్తి పంటకు కనీసం మద్దతు ధర అమలు, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐయూకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంది రామయ్య మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలు కొనసాగిస్తున్నాయన్నారు. స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం పత్తికి ఖర్చుల ప్రతిపాదికన రూ.10,075 కనీస మద్దతు ధర నిర్ణయించాలన్నా రు. పోడు రైతులను ఫారెస్ట్ అధికారులు భయపెడుతున్నారన్నారు. ఆయన వెంట సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ నిర్మల్ జిల్లా కార్యదర్శి కె.రాజన్న, గోరెభాయ్, లక్ష్మీనారాయణవర్మ, గోనె లచ్చన్న పాల్గొన్నారు.



ఏవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

# ఎస్బీఐలో కొనసాగుతున్న తనిఖీలు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని ఎస్బీఐ బ్యాంకులో గోల్డ్‌లోన్ అప్రైజర్‌గా పనిచేసిన కొండాజి ప్రశాంత్ నాణ్యతలేని బంగారాన్ని కుదువ పెట్టి రూ.43 లక్షల రుణం తన స్నేహితులు ఇతరుల పేరిట తీసుకుని సొంత అవసరాలకు వాడుకున్నాడు. సెప్టెంబర్ 12న బ్యాంకుకు వచ్చిన ఆడిట్ అధికారులు గోల్డ్‌లోన్ వివరాలను పరిశీలించగా తక్కువ ప్యూరిటీ ఉన్న ఆభరణాలను తనఖా పెట్టి డబ్బులు తీసుకున్నట్లు గుర్తించారు. ఈ తతంగం బయటపడి 10 రోజులు దాటినా ఇప్పటికీ బ్యాంకుకు చెల్లించాల్సిన రుణం పూర్తిస్థాయిలో చెల్లించలేదు. హైదరాబాదు నుంచి వచ్చిన ఆడిట్ అధికారులు బ్యాంకులో 900 గోల్డ్ లోన్ అకౌంట్లపై కుదువ పెట్టిన బంగారు ఆభరణాలను కొత్త అప్రైజర్‌తో క్షుణ్ణంగా తనిఖీలు చేయిస్తున్నారు. త్వరలో బ్యాంకును మోసం చేసి తీసుకున్న రుణాన్ని రికవరీ చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ఉన్నత అధికారులు, బ్యాంకు న్యాయవాదుల సలహాల మేరకు అప్రైజర్ ప్రశాంత్‌పై కేసు పెట్టాలా వద్దా అనే నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది.

# అమ్మకానికి దొడ్డు బియ్యం

• ఆరు నెలల తర్వాత మోక్షం
• ఈ–వేలం వేయాలని ప్రభుత్వ నిర్ణయం
• జిల్లాలో 4,535 మెట్రిక్ టన్నుల బియ్యం



నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఏప్రిల్ నుంచి రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తోంది. దీంతో మార్చి నాటికి గోదాంల ఉన్న దొడ్డు బియ్యం నిల్వలు పురుగులు, ఎలుకలకు ఆహారంగా మారాయి. బఫర్ గోదాంలు, ఎంఎల్ఎస్ పాయింట్లు, రేషన్ షాపుల్లో నిల్వ ఉన్న బియ్యం నాణ్యత దెబ్బతింటుంది. దీంతో వివిధ గోదాముల్లో నిల్వ ఉన్న 4,535.551 మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం ఈ–వేలం వేయాలని నిర్ణయించింది. కిలో బియ్యాన్ని రూ.24 బేస్ ధరగా నిర్ణయించి, పారదర్శకంగా విక్రయించేందుకు విధివిధానాలు రూపొందించింది. దీంతో కొత్త యాసంగి ధాన్యం, వానాకాలం బియ్యం నిల్వకు స్థలం లభిస్తుంది. వేలం ద్వారా ప్రభుత్వానికి ఆర్థిక లాభం చేకూరుతుంది.

**జిల్లా వ్యాప్తంగా దొడ్డు బియ్యం నిల్వలు మెట్రిక్ టన్నుల్లో..**

| | |
|---|---|
| మాటెగాం బఫర్ గోదాం | 537.698 మెట్రిక్ టన్నులు |
| లోకేశ్వరం బఫర్ గోదాం : | 1177.470 మెట్రిక్ టన్నులు |
| మామడ బఫర్ గోదాం: | 1988.168 మెట్రిక్ టన్నులు |
| జామ్ బఫర్ గోదాం : | 422.690 మెట్రిక్ టన్నులు |
| ఎంఎల్ఎస్ పాయింట్లు (నిర్మల్, భైంసా, ముధోల్, ఖానాపూర్): | 364.643 మెట్రిక్ టన్నులు |
| 412 రేషన్ షాపులు: | 409.525 మెట్రిక్ టన్నులు |

**ప్రభుత్వ ఆదేశాల మేరకు..**

జిల్లాలో మిగిలి ఉన్న దొడ్డు బియ్యానికి టెండర్లు పిలిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. జిల్లాలో నిల్వ ఉన్న 4535.551 మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యాన్ని ఈ వేలం ద్వారా ప్రభుత్వ ఆదేశానుసారం విక్రయించనున్నాం.

– సుధాకర్, సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్

# మైనారిటీ మహిళలకు ఆర్థిక భరోసా

• ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన ప్రారంభం..
• స్కీమ్ కింద ఒంటరి మహిళలకు రూ.50 వేల ఆర్థిక సాయం
• 'రేవంతన్న కా సహారా – మిస్కీన్ లే' కింద రూ.లక్ష గ్రాంట్




నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ ప్రభుత్వం మైనారిటీల అభ్యున్నతి కోసం రెండు కొత్త పథకాలను ప్రవేశపెట్టింది. 'ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన', 'రేవంతన్నకా సహారా మిస్కీన్ లే' పేరుతో వచ్చిన పథకాలు మహిళల ఆర్థిక స్వావలంబన, అట్టడుగు సముదాయాల సామాజిక ఉద్ధరణకు దోహదపడతాయి. ఈ నెల 19న సెక్రటేరియేట్‌లో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఈ పథకాలను లాంఛనంగా ప్రారంభించారు. మొత్తం రూ.30 కోట్ల బడ్జెట్‌తో అమలు చేసే ఈ పథకాలకు దరఖాస్తులు సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 6 వరకు టీజీవోబీఎంఎంఎస్ పోర్టల్(tgobmms.cgg.gov.in) ద్వారా ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు.

**ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన..**

ఈ పథకం మైనారిటీ మహిళలు(ముస్లిం, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ వర్గాలకు చెందినవారు) ఆర్థికంగా స్వతంత్రంగా మారేలా సహాయపడుతుంది. వితంతువులు, విడాకులు పొందినవారు, అనాథలు, అవివాహితలు, ఒంటరి మహిళలకు చిన్న వ్యాపారాల ప్రారంభానికి ఒక్కొక్కరికీ రూ.50 వేల గ్రాంట్ అందిస్తారు. ఇది రాష్ట్రంలో మైనారిటీ మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి, ఉద్యోగాల సృష్టికి దోహదపడుతుంది.

**అర్హతలు:**

- తెలంగాణ స్థిరనివాసులు, మైనారిటీ వర్గాలకు చెందినవారు.
- వయసు: 21 నుంచి 55 ఏళ్ల మధ్య ఉండాలి.
- విద్యార్హత: కనీసం 5వ తరగతి.
- వార్షిక ఆదాయం: గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షలు, పట్టణాల్లో రూ.2 లక్షలకు తక్కువ.
- గత ఐదేళ్లలో ఇతర ఆర్థిక సహాయాలు పొందకూడదు.
- అవసరమైన పత్రాలు: రేషన్ కార్డు, ఆధార్, వయసు/ఆదాయ ఆధారాలు.

**రేవంతన్నకా సహారా మిస్కీన్ లే..**

ముస్లిం సముదాయాల అభ్యున్నతికి ఈ పథకం రూపొందించబడింది. ఫకీర్, దూదేకుల, ఇతర అట్టడుగు ముస్లిం వర్గాల సభ్యులకు మోపెడ్‌లు, బైక్‌లు లేదా ఈ–బైక్‌లు అందించడానికి రూ.లక్ష గ్రాంట్ (100% రాయితీ) మంజూరు చేస్తారు. తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ (టీజీఎంఎఫ్‌సీ) ద్వారా అమలు చేసే ఈ చర్య ఆర్థిక బలహీనతను తగ్గించి, రోజువారీ జీవనాన్ని మెరుగుపరుస్తుంది.

**అర్హతలు:**

- తెలంగాణ స్థిరనివాసులు, మైనారిటీ వర్గాలకు చెందినవారు.
- వయసు: 21 నుంచి 55 ఏళ్ల మధ్య ఉండాలి.
- రేషన్ లేదా ఫుడ్ సెక్యూరిటీ కార్డు ఉండాలి.
- గత ఐదేళ్లలో టీజీఎంఎఫ్‌సీ నుంచి సహాయం పొందకూడదు.
- కుటుంబానికి ఒక్కరికి మాత్రమే ప్రయోజనం.

**అర్హులు దరఖాస్తు చేసుకోవాలి..**



జిల్లాలో అర్హులైన మైనార్టీలు దరఖాస్తు చేసుకోవాలి. ఇతర వివరాలకు కలెక్టరేట్‌లోని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఎఫ్3 లో సంప్రదించాలి,

– ఆర్.మోహన్‌సింగ్, జిల్లా అల్పసంఖ్యాకుల సంక్షేమ అధికారి

# అక్రమ పట్టా రద్దు చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న భైంసా మండలం హంపోలి గ్రామస్తులు

నిర్మల్‌చైన్‌గేట్: భైంసా మండలం హంపోలి గ్రామంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను అక్రమంగా చేసిన పట్టాను రద్దు చేయాలని, అదే స్థలంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.రాజు డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేసి అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జె.రాజు మాట్లాడుతూ 1983లో వరదల కారణంగా 16/అ,16/ఈ సర్వే నంబర్‌లోని ఐదు ఎకరాల పట్టా భూమిని కొని ఎస్సీ ఎస్టీలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పుడు ఆ భూమిలోని ఇళ్లను కూలగొట్టి, ఇతరులకు అక్రమంగా పట్టా చేశారని తెలిపారు. అక్రమ పట్టా రద్దు చేయాలని తహసీల్దార్, ఆర్డీవోతోపాటు పై అధికారులకు నివేదికలు పంపినా రద్దు కాలేదన్నారు. అక్రమంగా పట్టా చేసిన అప్పటి తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ధర్నాలో గ్రామస్తులు విట్టల్, గంగారం, సాయినాథ్, బాబు, ఎల్లన్న, భోజన్న, నరసన్న పాల్గొన్నారు.

### పర్యావరణ విద్య బ్రాండ్ అంబాసిడర్‌గా మోహన్‌రావు



నియామకపత్రం ఇస్తున్న డీఈవో భోజన్న

నిర్మల్‌టౌన్: పర్యావరణ విద్య బ్రాండ్ అంబాసిడర్‌గా ఎన్జీసీ సమన్వయ కర్త డి.మోహన్‌రావును నియమిస్తూ.. తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జి.ప్రసన్నకుమార్ ఉత్తర్వులను జారీ చేశారు. జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో భోజన్న సోమవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు.

# గోదావరికి కొనసాగుతున్న వరద

ఖానాపూర్: ఖానాపూర్, కడెం, మామడ మండలాల పరిధిలోని గోదావరి వరద కొనసాగుతోంది. ఎగువ నుంచి ఎస్సారెస్పీలోకి భారీగా వరద వస్తుండడంతో 40 గేట్లు ఎత్తి 2.50 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. దీంతో దిగువన వరద మరింత పెరిగింది. పరీవాహక ప్రాంత గ్రామాల ప్రజలు, రైతులు, పశువుల కాపర్లు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

### వావ్.. వర్టికల్ గార్డెన్




నిర్మల్ జిల్లా కేంద్రంలో సుందరీకరణ పనుల్లో భాగంగా స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియం మైదానంలోని గ్యాలరీపై వర్టికల్ గార్డెన్‌ను అందంగా తీర్చిదిద్దారు. 'ఐ లవ్ నిర్మల్' ఇంగ్లిష్ అక్షరాల ఆకృతిలో మొక్కలు పెంచారు. వాటికి ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు ఆకట్టుకుంటున్నాయి. రూ.4.50 లక్షలు ఇందుకు ఖర్చు చేశారు. స్థానికులు ఇక్కడ సెల్ఫీలు తీసుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

## క్లుప్తంగా

### వరద నీటిలోపడి ఒకరు మృతి


మాధవ్‌ (ఫైల్‌)

తానూరు: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి మద్యం మత్తులో వరదనీటిలో పడి ఒకరు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్సై షేక్‌ జుబేర్‌ తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఉమ్రి(కే) గ్రామానికి చెందిన చిలింకర్‌ మాధవ్‌ (35) ప్రైవేట్‌ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. పనికోసం వెళ్లిన ఆయన రాత్రి 8 గంటల ప్రాంతంలో ఉమ్రి(కే) బస్టాప్‌ వద్ద దిగి సమీపంలో ఉన్న కల్వర్టుపై కూర్చునే క్రమంలో అందులో పడి మృతి చెందాడు. సోమవారం ఉదయం మృతదేహాన్ని గమనించిన స్థానికులు బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరు..


భీముడు (ఫైల్‌)

ఇచ్చోడ: మహారాష్ట్రలోని పాండ్రకొడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లా వాసి మృతి చెందాడు. మండలంలోని సిరిచెల్మ గ్రామానికి చెందిన సాదుల భీముడు (60) ఆదివారం ఉదయం పాండ్రకొడలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. బస్సు దిగి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.

### రైలు కిందపడి తల్లీకూతురు ఆత్మహత్య

- గాయాలతో బయటపడిన భర్త
- ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తింపు

కాగజ్‌నగర్‌రూరల్‌: ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రానికి చెందిన ఓ వలస కూలీ తన కుమార్తెతో కలిసి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. బెల్లంపల్లి రైల్వే ఎస్సై సుధాకర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రానికి చెందిన జగత్‌రాం, స్వప్న (27) దంపతులు 20 రోజుల క్రితం ఇటుకబట్టీలో పనిచేసేందుకు వచ్చి చింతగూడ సమీపంలో నివాసం ఉంటున్నారు. కుటుంబ కలహాలతో ఆదివారం రాత్రి కుమార్తె జాస్మి (11నెలలు)తో కలిసి స్వప్న ఆత్మహత్య చేసుకునేందుకు చింతగూడ రైల్వే క్రాసింగ్‌ వద్దకు వెళ్లింది. విషయం తెలుసుకున్న జగత్‌రాం వారిని ఆపేందుకు ప్రయత్నించే క్రమంలో గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో స్వప్న, జాస్మి అక్కడికక్కడే మృతి చెందారు. జగత్‌రాంకు తీవ్రగాయాలు కావడంతో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై పేర్కొన్నారు.

### ఉరేసుకుని ఒకరు..

ఆదిలాబాద్‌రూరల్‌: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై విష్ణువర్ధన్‌ తెలిపిన వివరాల మేరకు మండలంలోని యాపల్‌గూడకు చెందిన బౌనే గంగారాం (49) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై ఇంట్లో తరచూ భార్యతో గొడవ పడేవాడు. మద్యం మానేయాలని భార్య జయ ఆదివారం మందలించింది. దీంతో మనస్తాపానికి గురై సోమవారం గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకున్నాడు. అటుగా వెళ్లినవారు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### మద్యానికి బానిసై మరొకరు..


లక్ష్మణ్‌ (ఫైల్‌)

మంచిర్యాలక్రైం: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. సీఐ ప్రమోద్‌రావు తెలిపిన వివరాల మేరకు జిల్లా కేంద్రంలోని పాత గర్మిళ్లకు చెందిన మిల్కూరి లక్ష్మణ్‌ (34)కు పదమూడేళ్ల క్రితం త్రివేణితో వివాహమైంది. దంపతులకు ఇద్దరు కుమారులు మణిరుద్‌, క్రిష్‌ ఉన్నారు. కూలీ పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 21న సాయంత్రం అతిగా మద్యం సేవించాడు. జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య త్రివేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

### జాతీయస్థాయి పోటీలకు రెఫరీగా ‘రిక్కల’


వెంకట రామకృష్ణ

రెబ్బెన: తమిళనాడులోని దిండిగల్‌లో ఈ నెల 24 నుంచి 28 వరకు జరుగనున్న జాతీయస్థాయి బాల్‌ బ్యాడ్మింటన్‌ పోటీలకు రెఫరీగా రెబ్బెన మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌కు చెందిన రిక్కల వెంకట రామకృష్ణ ఎంపికై నట్లు బ్యాడ్మింటన్‌ ఆఫ్‌ ఇండియా చీఫ్‌ రెఫరీ జ్యోతిష్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామకృష్ణను అసోసియేషన్‌ చీఫ్‌ ప్యాట్రన్‌ నారాయణరెడ్డి, అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్‌, ప్రధాన కార్యదర్శి ఎస్‌.తిరుపతి, సెపక్‌తక్రా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, షార్ప్‌స్టార్‌ అసోషియేషన్‌ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు అభినందించారు.

**రాష్ట్ర మహిళా జట్టు కోచ్‌గా ఎస్‌.తిరుపతి**

రాష్ట్ర మహిళా జట్టు కోచ్‌గా గోలేటికి చెందిన ఎస్‌.తిరుపతి ఎంపికై నట్లు అసోసియేషన్‌ ఉమ్మడి జిల్లా చీఫ్‌ ప్యాట్రన్‌ ఆర్‌.నారాయణరెడ్డి తెలిపారు.




# ఉర్రూతలూగించే ఉయ్యాల పాటలు

- కొత్తగా పండుగ విశిష్టత ఆవిష్కరణ
- డీజే మేళవింపుతో కొత్త ఊపు..
- ఊరూరా మార్మోగుతున్న పాటలు

తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక బతుకమ్మ. పువ్వులను పూజించే వేడుక. ప్రకృతితో ముడిపడి ఉన్న పండుగ. ఆడపడుచులు వయోభేదం లేకుండా జరుపుకునే ఉత్సవం. ఒకప్పుడు బతుకమ్మ పాటలు అంటే మహిళలు పాడేవారు. ఒక మహిళ పాడితే మిగతావారు గొంతు కలిపేవారు. రెండు దశాబ్దాలుగా పాటలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. డీజే మేళవించి కొత్త జోష్‌ తెస్తున్నాయి. పాటల రచనలు, చిత్రీకరణతో ఇప్పుడు ఊరూరా ఈ ఉయ్యాల పాటలు మార్మోగుతున్నాయి. బతుకమ్మ పాటలు తెలంగాణ ఆత్మను ప్రతిధ్వనింపజేస్తున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాకు చెందిన కవులు, రచయితలు బతుకమ్మ పాటలను వైవిధ్యంగా రాస్తున్నారు. జిల్లాకే చెందిన మ్యూజిక్‌ డైరెక్టర్లు, డైరెక్టర్లు, కెమెరామెన్లు ఈ పాటలను చిత్రీకరించి కొత్త జీవం పోస్తున్నారు. గౌరమ్మను కీర్తిస్తూ, పురాణ కథలను, ప్రజల జీవన కష్టాలను ఆధారంగా చేసుకున్న ఈ పాటలు గ్రామీణ సౌందర్యాన్ని, సంప్రదాయాలను ఆధునిక మేళవింపుతో అందిస్తున్నారు.

## యూట్యూబ్‌ మాధ్యమం..సంప్రదాయ సోయగం


బతుకమ్మ పాట చిత్రీకరణలో జిల్లా కళాకారులు

నిర్మల్‌ఖిల్లా: పల్లెదనం ప్రతిబింబించేలా సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు నిర్మల్‌ జిల్లా కవులు, కళాకారులు తమవంతు ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రత్యేకంగా బతుకమ్మ పాటలను రచించి, సంగీతం, స్వర కల్పన చేస్తూ చిత్రీకరించి జన బాహుళ్యంలో విడుదల చేస్తున్నారు. పాతతరం మహిళల నుంచి సేకరించిన సమాచారంతో పండుగ ప్రశస్త్యాన్ని రంగరించి పాటల రూపంలో తీస్తున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన గొనుగొప్పుల రాజశేఖర్‌, ఎల్లుల్ల నవీన్‌, రామ్‌రాజ్‌ కాంద్రే, గోపి, విలాస్‌ ‘మనఇంటి బతుకమ్మ-2025’ పేరిట పాటను సారంగాపూర్‌ మండలం బోరిగాం సమీపంలో పాట చిత్రీకరణ పూర్తి చేశారు. రాజశేఖర్‌ కొరియోగ్రఫీ, దర్శకత్వం వహించగా కెమెరా, ఎడిటింగ్‌ రామ్‌రాజ్‌ కాంద్రే, పాట రచన, సంగీతం, గాయకుడిగా ఎల్లుల నవీన్‌ చేశారు. ప్రధానపాత్రల్లో గోపి, రజిని, తదితరులు నటించారు.

**భావితరాలకు తెలియజెప్పేందుకే...**



బతుకమ్మ పాటల్లో మన భాషా మాధుర్యం, పల్లె జానపద రీతులు ప్రతిబింబించడం భవిష్యత్‌ తరాలకు సంపద. ఈ పాటలు ఆనందాన్ని, ఉత్సాహాన్ని కలిగించడమే కాకుండా సంప్రదాయాన్ని ప్రపంచానికి చాటే ప్రయత్నం చేస్తున్నాం. స్థానిక లొకేషన్లు, కళాకారులతో పాటను ఇక్కడే చిత్రీకరించాం.– గొనుగొప్పుల రాజశేఖర్‌, డైరెక్టర్‌, డ్యాన్స్‌మాస్టర్‌, నిర్మల్‌

**అనుబంధాలను మేళవించాం...**



తెలంగాణ జానపద సంప్రదాయం పాటల ద్వారానే కొత్త తరాలకు చేరువవుతోంది. నిర్మల్‌ జిల్లాలో బతుకమ్మ పాటల రచన, చిత్రీకరణ ద్వారా స్థానిక సంస్కృతి మరింతగా వెలుగులోకి వస్తుంది. తెలంగాణకు ప్రాణం లాంటి బతుకమ్మ పండుగను ప్రత్యేకంగా నిలబెట్టే విధంగా నిర్మల్‌ జిల్లాలో బతుకమ్మ పాటల సృష్టి, చిత్రీకరణ సాగించాం. – రామ్‌రాజ్‌ కాంద్రే, కెమెరామెన్‌, ఎడిటర్‌, నిర్మల్‌

**వీక్షకులకు చేరువవుతుంది**



స్థానిక జీవన విధానానికి దగ్గరగా జానపద సరళిలో సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా పాటను స్వరపరిచాం. యువతీ యువకులు, మహిళలను ఆకట్టుకునే విధంగా పండుగ వాతావరణంలో ఉండే ఈ పాట ప్రతీఒక్కరికి నచ్చుతుందని ఆశిస్తున్నాం. ఎంగిలిపూల బతుకమ్మ రోజున పాటను విడుదల చేశా. – ఎల్లుల నవీన్‌, రచయిత, సంగీత దర్శకుడు, నిర్మల్‌

## బతుకమ్మ పాటల్లో మనోళ్లు..

- రచయితగా రాణిస్తున్న దినేష్‌కుమార్‌
- నృత్య దర్శకుడిగా ప్రత్యేకత చాటుకుంటున్న మధు


బతుకమ్మ పాటకు నృత్యశిక్షణ ఇస్తున్న మధు (ఫైల్‌)

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన జంజిరాల దినేష్‌కుమార్‌ గాయకుడిగా, బతుకమ్మ పాటల రచయితగా రాణిస్తున్నాడు. తన 15 ఏళ్ల ప్రస్థానంలో కోల్‌బెల్ట్‌ ప్రాంత ప్రజానీకానికి ఎంతో చేరువయ్యాడు. జానపద బాణీలతో జనరంజకమైన బతుకమ్మ పాటలు రచించి పలు వేదికల మీద ఆలపించడంతో యూట్యూబర్ల దృష్టిని ఆకర్షించాడు. ఆ పాటలను యూట్యూబర్లు ప్రసిద్ధిగాంచిన జానపద నృత్యకళాకారులతో ప్రత్యేకంగా చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో విడుదల చేస్తున్నారు. ఇప్పటి వరకు 10కి పైగా బతుకమ్మ పాటలు రాయగా యూట్యూబ్‌లో వేలాది మంది వీక్షించడం గమనార్హం. తన రచనల ద్వారా బతుకమ్మ పండుగ విశిష్టతను తెలుపుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను బాహ్య ప్రపంచానికి చాటి చెప్పడానికి తనవంతు కృషి చేస్తున్నాడు. బెల్లంపల్లికి చెందిన హన్మాండ్ల మధు రెండు దశాబ్దాలకు నృత్యకళాకారుడిగా రాణిస్తుండగా ఐదేళ్ల కాలం నుంచి బతుకమ్మ పాటలకు నృత్యదర్శకుడిగా కూడా వ్యవహరిస్తున్నాడు. దర్శక, నిర్మాతలు బెల్లంపల్లి చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో పాటలను చిత్రీకరించి యూట్యూబ్‌లో అప్‌లోడ్‌ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం యూట్యూబ్‌లో రాణిస్తున్న పలువురు నృత్య కళాకారులకు మధు గురువు కూడా. అతని వద్ద నృత్యం నేర్చుకున్న యువతీ, యువకులు సామాజిక మాధ్యమాల కోసం చిత్రీకరించే జానపద, బతుకమ్మ పాటలపై నృత్యం చేస్తూ అలరిస్తున్నారు. మధు నృత్య దర్శకత్వం వహించిన బతుకమ్మపాటలు బహుళ ప్రజాదరణ పొందుతున్నాయి.

**పాటలు పాడడం ఇష్టం**



పాటలు పాడటం నాకు చిన్నతనం నుంచే అబ్బిన కళ. అనేక వేదికల మీద, సభలు, సమావేశాల్లో వందల సంఖ్యలో పాటలు పాడా. పలువురి కోరిక మేరకు బతుకమ్మ పాటలు రాయడం నేర్చుకున్నా. ఇప్పటికీ 10కి పైగా పాటలు రాశా. యూట్యూబ్‌లో నాపాటలు ప్రజాదరణ పొందడం ఆనందంగా ఉంది. ఇదే పట్టుదలతో ముమ్ముందు మరిన్ని పాటలు రాస్తా. – జంజర్ల దినేష్‌కుమార్‌

**నృత్యం ప్రత్యేకమైంది**



ఇప్పటి వరకు వందల సంఖ్యలో జానపద, బతుకమ్మ, సినీ పాటలకు నృత్యం చేశా. బతుకమ్మపాటలకు నృత్య రీతులు అందించడం అంత తేలిక కాదు. తరాల నుంచి వస్తున్న బతుకమ్మ సంప్రదాయాలకు ఏమాత్రం భంగం వాటిల్లకుండా నృత్యం చేయాల్సి ఉంటుంది. పదుల సంఖ్యలో బతుకమ్మ పాటలకు నృత్య దర్శకత్వం వహించిన నాకు ఎంతోమంచి పేరు వచ్చింది. – హన్మాండ్ల మధు, నృత్య దర్శకుడు

**బతుకమ్మ విశిష్టతపై పాట..**



మంచిర్యాలఅర్బన్‌: గతేడాది సద్దుల బతుకమ్మ నేపథ్యంలో బతుకమ్మ విశిష్టత, బతుకమ్మకు ఉపయోగించే ఒకనాటి ప్రాచీన పూల సంపద, తొమ్మిదిరోజులు అమ్మవారి అవతార విశేషాలను ఇనుమడింపజేసే ఒక్కేసి పువ్వేసి.. బతుకమ్మ గీతాన్ని రాసి వీడియోగా చిత్రీకరించి దాసరి మ్యూజిక్‌ అనే యూట్యూబ్‌ చానల్‌లో అప్‌లోడ్‌ చేశా. – దాసరి శ్రీనాథ్‌, కవి, పాటల రచయిత

**జానపద వేడుక..**



మంచిర్యాలఅర్బన్‌: సంప్రదాయం, సాంస్కృతిక నేపథ్యంలో జరుపుకునే జానపద వేడుక ఇది. భగవంతున్ని పూలతో పూజించటం కాక పూలనే పూజించటం బతుకమ్మ పండుగ ప్రత్యేకత. బతుకమ్మ పాటలకు ప్రజాదరణ ఎక్కువ. గ్రామాల్లో పాడుకునే పాటలనే వీడియో చిత్రీకరించాలని ఆలోచన చేశా. తల్లిబతుకమ్మ.. వరాల బతుకమ్మ.. బిత్తిరి సత్తి బతుకమ్మ తంగేడు పూల బతుకమ్మ లాంటి పాటలకు నృత్య దర్శకుడిగా వ్యవహరించి యూట్యూబ్‌లో అప్‌లోడ్‌ చేశా. – అడ్డగూరి లక్ష్మీనారాయణ, నృత్యదర్శకుడు

**భక్తితో ఆదమరిచి ఆడుకునే ఆట.**



మంచిర్యాలఅర్బన్‌: బతుకమ్మ పాటల్లో మహిళలు తమ కష్టాసుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయత, భక్తితో ఆదమరిచి ఆడుకునే ఆట. ఆశువుగా చెప్పే పాటలతో ఆడుకునే సంప్రదాయం కాస్తా డీజేలు వచ్చాక రికార్డింగ్‌ పాటలతో బతుకమ్మ హోరెత్తుతోంది. తెలంగాణ ఉద్యమం నుంచి ఈ పండుగ ఎంతో ప్రాచుర్యం పొందింది. తెలంగాణలో ప్రజలు తమ ఇంటి దేవతగా బతుకమ్మను పూజిస్తారు. – వామన్‌రావు, కవి, రచయిత

**తెలంగాణ ఉద్యమం నుంచి..**

మంచిర్యాలఅర్బన్‌: 2009లో తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ఎన్నో పాటలు ఆలపించాను. తెలంగాణ వచ్చిన తర్వాత తెలంగాణలో జరిగే ఘనమైన బతుకమ్మ పండుగ సందర్భంగా యూట్యూబ్‌ ఛానల్‌ ఓపెన్‌ చేశా. 2019లో సింగర్‌ మానస ఆఫిసల్‌లో మొదటగా బతుకమ్మ పాట పాడా. 2025లో ఉయ్యాలో రామా.. ఉయ్యాలో అంటూ బతుకమ్మ పాట చేయటం జరిగింది. ఇప్పటి వరకు ఆరు బతుకమ్మ పాటలు పాడా. బతుకమ్మ పాటలకు ఎంతో ఆదరణ లభిస్తోంది. – నూనె మానస, గాయని

## బాసరలో శరన్నవరాత్రి ఉత్సవాలు


పూజాసామగ్రి తీసుకెళ్తున్న ఈవో, చైర్మన్‌

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో సోమవారం శ్రీ శారదీయ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు అమ్మవారు శైలపుత్రి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి నైవేద్యంగా కట్టెపొంగలిని సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి మహా రుద్రాభిషేకం, మహా కుంభాభిషేకం, తదితర ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అంజనీదేవి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. గోదావరినదిలో పుణ్యస్నానం ఆచరించి అమ్మవారి దర్శనానికి క్యూలో బారులు తీరారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసం, కుంకుమార్చన పూజలు చేయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముధోల్‌ సీఐ మల్లేశ్‌, బాసర ఎస్సై శ్రీనివాస్‌ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అమ్మవారికి ఉచిత అన్నదాన ప్రసాదాన్ని గడిపుర బాబా జగదీష్‌ మహారాజ్‌, దేవస్థానం సమన్వయంతో వితరణ చేశారు.

## అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్‌: ప్రజావాణిలో వచ్చే అర్జీలను సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రాజెక్టు అధికారి చాంబర్‌లో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ సమస్యలపై ప్రజలు నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. తలమడుగు మండలం కాపర్దేవికి చెందిన చిత్రకళ కిరాణా దుకాణం ఇప్పించాలని, ఇచ్చోడకు చెందిన కిరణ్‌ కుమార్‌ ట్రికార్‌ రుణం మంజూరు చేయాలని, జైనూర్‌ మండలం పాట్నపూర్‌కు చెందిన ఉత్తమ్‌ వాటర్‌ ప్లాంట్‌ ఇప్పించాలని అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారులు సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

### పోలీస్‌ పెట్రోకార్‌ను ఢీకొన్న బైక్‌

భైంసాటౌన్‌: మద్యం మత్తులో ఓ వ్యక్తి పోలీస్‌ పెట్రోకార్‌ను ఢీకొన్న ఘటన ఆదివారం రాత్రి పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. భైంసా రూరల్‌ పోలీస్‌స్టేషన్‌ సిబ్బంది పెట్రోలింగ్‌ కోసం పెట్రోకార్‌లో హస్గుల్‌ చౌక్‌ వద్ద రోడ్డు దాటుతుండగా పిప్రి కాలనీకి చెందిన కొలవాడ ఉమేశ్‌ బైక్‌పై భైంసా వైపు నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో కానిస్టేబుల్‌ లస్మన్నకు గాయాలు కాగా వాహనం పాక్షికంగా దెబ్బతింది. బైక్‌పై ఉన్న ఉమేశ్‌కు తీవ్ర గాయాలు కావడంతో క్షతగాత్రులను ఏరియాస్పత్రికి తరలించారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని రూరల్‌ సీఐ నైలు సూచించారు.

### వర్క్‌ఫ్రమ్‌ హోం పేరిట రూ.5లక్షలు టోకరా

రామకృష్ణాపూర్‌: రామకృష్ణాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని గద్దెరాగిడి అమ్మాగార్డెన్స్‌లో నివాసం ఉంటున్న ఓ మహిళ సైబర్‌ మోసగాళ్ల చేతిలో రూ.5 లక్షలు పోగొట్టుకుందని పట్టణ ఎస్సై రాజశేఖర్‌ తెలిపారు. సదరు మహిళ ఫేస్‌బుక్‌ ఖాతాకు వర్క్‌ ఫ్రమ్‌ హోం అనే పార్ట్‌టైమ్‌ జాబ్‌ ఉందని ఓ గుర్తు తెలియని వ్యక్తి లింక్‌ పంపించాడు. అది ఓపెన్‌ చేసి అందులో ఉన్న హోటల్స్‌కు సంబంధించి రివ్యూస్‌ చేయడంతో పాటు ఇచ్చిన టాస్కులు కూడా పూర్తి చేస్తే డబ్బులు వస్తాయని సైబర్‌ నేరగాళ్లు మహిళను నమ్మించారు. అలాగే ఆన్‌లైన్‌ బిజినెస్‌లో పెట్టుబడి పెడితే పెద్ద మొత్తంలో డబ్బులు వస్తాయని నమ్మబలకడంతో సదరు మహిళ రూ. 5లక్షలు విడతల వారీగా పంపింది. విత్‌డ్రా కోసం సైబర్‌ నేరగాళ్లను సంప్రదించగా వారు మరో రూ.5లక్షలు ఇవ్వాలని చెప్పడంతో మోసపోయానని గ్రహించి సోమవారం పోలీస్‌స్టేషన్‌తో పాటు 1930కు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వే ఫ్లైఓవర్‌ బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (60) మృతి చెందినట్లు ఎస్సై మజారొద్దీన్‌ సోమవారం తెలిపారు. మృతుడు ఆరెంజ్‌ కలర్‌ టీ షర్ట్‌, నలుపు రంగు ప్యాంట్‌ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాలకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గానీ 8712656534 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### 9,11 తరగతుల్లో ప్రవేశ గడువు పొడగింపు

కాగజ్‌నగర్‌టౌన్‌: పట్టణంలోని జవహర్‌ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరంలో 9, 11 తరగతుల్లో ప్రవేశానికి గడువు అక్టోబర్‌ 7 వరకు పొడగించినట్లు ప్రిన్సిపాల్‌ రేపాల కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్‌ జిల్లాలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు 9వ తరగతి, పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 11వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తొమ్మిదిలో ప్రవేశానికి https:// cbseitms. nic. in /2025/nvsix_9 11వ తరగతిలో ప్రవేశానికి https: //cbseitms. nic.in /2025/ nvsxi_11 వెబ్‌ సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

### యువకుడిపై పోక్సో కేసు

ఆదిలాబాద్‌టౌన్‌: పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన సౌరబ్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్‌ సీఐ సునీల్‌కుమార్‌ తెలిపారు. ప్రేమపేరిట బాలికను కిడ్నాప్‌ చేశాడని బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడి ఫోన్‌ ట్రేస్‌ చేయగా మహారాష్ట్రలోని లాతూర్‌లో ఉన్నట్లు గుర్తించామన్నారు. సోమవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

### వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ

తలమడుగు: మండలంలోని బరంపూర్‌ సమీపంలో కొండపై ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై రాధిక తెలిపారు. సోమవారం ఉదయం ఆలయానికి వెళ్లిన స్థానికులు గమనించి గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న రూరల్‌ సీఐ ఫణీందర్‌, ఎస్సై రాధిక క్లూస్‌ టీం, డాగ్‌ స్క్వాడ్‌తో ఆలయ పరిసరాలు పరిశీలించారు. హుండీలో ఉన్న రూ.5 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### వైన్స్‌లో..

తానూరు: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి వైన్స్‌లో ఆదివారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై షేక్‌ జుబేర్‌ తెలిపారు. వైన్స్‌ వెనుక భాగం నుంచి ఉన్న రేకులను తొలగించిన దుండగులు లోనికి చొరబడి రూ.లక్ష విలువైన మద్యం బాటిళ్లతో పాటు రూ.8 వేల నగదు, సీసీ ఫుటేజీలను తీసుకువెళ్లినట్లు తెలిపారు. సోమవారం ఉదయం వైన్స్‌ సిబ్బంది వచ్చి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ మల్లేశ్‌, ఎస్సై షేక్‌ జుబేర్‌ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

## బ్యాటరీల చోరీ నిందితుడి రిమాండ్‌


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రసాద్‌

ఇంద్రవెల్లి: బ్యాటరీలు చోరీ చేసిన నిందితుడిని అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఉట్నూర్‌ సీఐ మడావి ప్రసాద్‌ తెలిపారు. విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గత జూలై, ఆగస్టులో మల్లాపూర్‌, పిప్రి గ్రామపంచాయతీల్లో 6, సిరికొండ మండలంలోని కొండపూర్‌లో 3, గుడిహత్నూర్‌ మండలం రాఘపూర్‌లో 3 టీఫైబర్‌ బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. టీ ఫైబర్‌ ఫీల్డ్‌ మేనేజర్‌ చిట్యాల రాజు గుడిహత్నూర్‌ మండలంలోని ముత్నూర్‌కు చెందిన పైతానే ధన్‌రాజ్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ ఆగస్టు 18న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నిందితుడికోసం గాలిస్తున్న పోలీసులు సోమవారం పైతానే ధన్‌రాజ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణలో బ్యాటరీలను దొంగిలించి గుడిహత్నూర్‌ మండలంలోని తోషం గ్రామానికి చెందిన షేక్‌ రహీంకు విక్రయించినట్లు చెప్పడంతో అతనిపై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## యువతిని వేధించిన ఆటోడ్రైవర్‌

- అమ్మాయి తరఫు బంధువుల దాడి
- ఇరువర్గాలపై కేసు నమోదు


వివరాలు సేకరిస్తున్న ఎస్సై శ్యాంపటేల్‌

చెన్నూర్‌: చెన్నూర్‌ పట్టణంలోని అస్నాద రోడ్డులో ఘర్షణ పడిన ఘటనలో ఇరువర్గాలపై కేసునమోదు చేసినట్లు సీఐ దేవేందర్‌రావు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. కోటపల్లి మండలంలోని బబ్బెర చెలుక గ్రామానికి చెందిన ఓ యువతి సోమవారం తన వదినతో కలిసి దుర్గామాత ఉత్సవాల సామగ్రికోసం చెన్నూర్‌కు వచ్చింది. అస్నాద రోడ్డులోని ఓ దుకాణంలో షాపింగ్‌ చేశారు. కోటపల్లి మండలం లింగన్నపేటకు చెందిన ఆటో డ్రైవర్లు ఆసంపల్లి శేఖర్‌, రఘు, రఘు, శ్రీకాంత్‌, కోనం అంజన్న అదేషాపులో సామగ్రి కొనుగోలుకు వచ్చారు. యువతి బయటకు వెళ్లిపోతుండగా ఆసంపల్లి శేఖర్‌ ఆమె దుస్తుల విషయమై కామెంట్‌ చేయడంతో ఆగ్రహానికి గురై అతడిని చెప్పుతో కొట్టింది. డ్రైవర్‌ కూడా ఆమెపై దాడి చేసి దుర్భాషలాడాడు. విషయం తెలుసుకున్న యువతి బంధువులు ఆటోను ధ్వంసం చేసి డ్రైవర్లతో ఘర్షణకు దిగారు. స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఇరువర్గాలు పరస్పరం దాడి చేసుకున్నారు. ఎస్సై శ్యామ్‌పటేల్‌ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధిత యువతి, శేఖర్‌ వేర్వేరుగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## ఎడ్లబండిపై వాగు దాటుతూ మహిళ గల్లంతు

- గేదె, ఎద్దు మృతి
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ జానకీ షర్మిల


ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

భైంసారూరల్‌: మండలంలోని బిజ్జూర్‌-బాబుల్‌గాం గ్రామాల మధ్య ఉన్న వాగును ఎడ్లబండిపై దాటుతుండగా మహిళ గల్లంతైన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు బిజ్జూరుకు చెందిన నగేశ్‌రెడ్డి అనే రైతు పాలేరు మాటేగాం గ్రామానికి చెందిన సురేశ్‌ ఎడ్లబండికి వెనుకాల గేదెను కట్టుకుని పంట పొలానికి బయలుదేరాడు. ఈ క్రమంలో అతని చేను పక్కనే ఉన్న గంటోళ్ల లక్ష్మీబాయి తానూ ఎడ్లబండిపై వస్తానని చెప్పడంతో సురేశ్‌ ఆమెను ఎక్కించుకున్నాడు. గ్రామ సమీపంలోని చిన్న సుద్దవాగు దాటుతుండగా ఒకేసారి ఎగువ నుంచి రంగారావు ప్రాజెక్టు నీరు రావడంతో ఎడ్లబండి వాగులోని గుంత వైపుకువెళ్లి మునిగిపోయింది. ఈ ఘటనలో లక్ష్మీబాయి గల్లంతుకాగా ఎద్దు, గేదె మృతి చెందాయి. సురేశ్‌ ఈదుకుంటూ ప్రాణాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీ అవినాశ్‌ కుమార్‌, సీఐ నైలు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గజ ఈతగాళ్లతో వెతికించినా మహిళ ఆచూకీ లభ్యం కాలేదు. ఎస్పీ అధికారులతో మాట్లాడి సహాయక చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు కురిసినప్పుడు నదులు, వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని స్థానికులకు సూచించారు.

# కొలువుదీరిన దుర్గమ్మ

నిర్మల్‌టౌన్/కుంటాల/తానూరు/నిర్మల్‌చైన్‌గేట్/భైంసాటౌన్/సోన్/భైంసారూరల్/కుభీర్/నిర్మల్‌టౌన్/ఖానాపూర్/దస్తురాబాద్/సారంగపూర్: జిల్లావ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సోమవారం ప్రారంభమయ్యాయి. ఆయాచోట్ల అందంగా అలంకరించిన మండపాల్లో దుర్గామాతలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు తొమ్మిది రోజులపాటు భక్తులకు వివిధ రూపాల్లో దర్శనమివ్వనున్నారు. పలుచోట్ల భవానీ దీక్షలు స్వీకరించారు. మండపాల వద్ద ప్రతీరోజు అన్నదానం చేపట్టనున్నారు.

- నిర్మల్‌లోని బంగల్‌పేట్ శ్రీ మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు ఉన్నారు.
- జిల్లాకేంద్రంలోని శ్రీగిరి నందిగుండం దుర్గామాత ఆలయ వ్యవస్థాపకులు కొండాజి వెంకటాచారి ఆధ్వర్యంలో సుమారు 4 వేలకు పైగా భక్తులకు భవాని మాలధారణ గావించారు.



కుంటాలలో పూజలు చేస్తున్న భక్తులు

తొలిరోజు బాలత్రిపుర సుందరి దేవీ అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, పూజారి నరహరి, ఆనంద్, జనార్దన్, పూజారి సందీప్ పాల్గొన్నారు.

- సోన్ మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో భవాని యూత్ సభ్యులు 21 ఏళ్లుగా దుర్గామాత నెలకొల్పుతున్నారు. ఈ సంవత్సరం 21 ముఖాలతో దుర్గామాత ఏర్పాటు చేశారు.



న్యూవెల్మల్‌లో ఏర్పాటు చేసిన 21 ముఖాలతో అమ్మవారు

కడ్తాల్ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో పలువురు భక్తులు భవానీ మాలధారణ స్వీకరించారు. గురుస్వామి నర్సారెడ్డి ఆధ్వర్యంలో శ్రీ మాలికాపురోత్తమ అమ్మవారికి పూజలు నిర్వహించారు.



నందిగుండం దుర్గామాత ఆలయంలో..



రేవోజిపేటలో..



తానూరులో కొలువుదీరిన దుర్గామాత



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు



భైంసా మండలం వానల్‌పాడ్‌లో..



సోన్: కడ్తాల్ అయ్యప్ప స్వామి ఆలయంలో భవానీ మాలధారణలో భక్తులు

## క్లుప్తంగా

### ఆధ్యాపకులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కడెం: కళాశాల ఆధ్యాపకులు తమను వేధిస్తున్నారని కడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఎంపీసీ సెకండియర్ విద్యార్థులు పవన్ సాయి, సుధీర్ ఆరోపించారు. ఈ విషయమై కలెక్టర్ అభిలాష అభినవ్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ముగ్గురు ఆధ్యాపకులు తమను టార్గెట్ చేసి కళాశాలకు రాకుండా భయందోళనకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు.

### కొబ్బరికాయల విక్రయానికి నేడు వేలం

దిలావర్‌పూర్: మండలంలోని సాంగ్వి గ్రామంలో ఈనెల 27, 28 తేదీల్లో జరిగే గంగనీళ్ల జాతర సందర్భంగా మంగళవారం కొబ్బరికాయల విక్రయానికి వేలం పాట నిర్వహించనున్నట్లు స్థానిక ఆలయ కమిటీ చైర్మన్ పంతుల సుభాష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గంగనీళ్ల జాతర సందర్భంగా గ్రామంలో గోదావరి నది తీరాన కొబ్బరికాయలు విక్రయించేందుకు వేలం ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఆలయ ప్రాంగణంలో ఉదయం జరిగే వేలంలో పాల్గొనాలని కోరారు.

### సబ్సిడీపై యంత్ర పరికరాలు

మామడ: మండలంలోని రైతులకు సబ్సిడీపై వ్యవసాయ సాగు యంత్ర పరికరాలను అందించనున్నట్లు ఏవో సంధ్య ఓ ప్రకటనలో తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్, రోటవేటర్, సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్, ట్రాక్టర్ కల్టివేటర్‌ను 50 శాతం సబ్సిడీపై మహిళ రైతులు పొందవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న మహిళ రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, ట్రాక్టర్ ఆర్సీ జిరాక్స్, భూసార పరీక్షకు సంబంధించిన వివరాలతో దరఖాస్తులను వ్యవసాయ కార్యాలయంలోని క్లస్టర్ రైతు వేదికలో ఇవ్వాలని సూచించారు.

### మాజీ మంత్రి పి.నర్సారెడ్డి జయంతి



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సారంగపూర్: మండలంలోని మలక్‌చించోలితోపాటు మండల కేంద్రంలో మాజీ మంత్రి పి.నర్సారెడ్డి 95వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అడెల్లి ఆలయ కమిటీ చైర్మన్ భోజాగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్ మాట్లాడారు. నర్సారెడ్డి స్థానికంగా మండల ప్రజలంతా నర్సన్న బాపుగా పిలుస్తారని అన్నారు. ఆయన వల్లే స్వర్ణ గ్రామంలో స్వర్ణ ప్రాజెక్టు నిర్మితమైందని గుర్తు చేశారు. మండల రైతుల పంట పొలాలకు నేడు రెండు పంటలకు సరిపడా నీరందుతుందంటే అది ఆయన చేసిన మేలేనని అన్నారు. స్వర్ణ ప్రాజెక్టుకు ప్రభుత్వం నర్సన్న బాపు పేరు పెట్టాలని కోరారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ అయిర నారాయణరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు తదితరులు ఉన్నారు.

### ఎంహెచ్‌పీఎస్ ప్రధాన కార్యదర్శిగా శివ

నిర్మల్‌టౌన్: మాదిగ హక్కుల పరిరక్షణ సమితి (ఎంహెచ్‌పీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన దాసరి శివను నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద ఆయనకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుంకే ప్రభాకర్ సోమవారం నియామకపత్రాన్ని అందజేశారు.

### పోలీసుస్టేషన్ తనిఖీ



పరిశీలిస్తున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్

కుభీర్: కుభీర్ పోలీసుస్టేషన్‌ను సోమవారం ఏఎస్పీ అవినాష్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన వెంట ఎస్సై క్రిష్ణారెడ్డి, పోలీసు అధికారులు ఉన్నారు.

### ప్రశాంతంగా పరీక్షలు

నిర్మల్‌టౌన్: పట్టణంలో తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఓపెన్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలు, తెలంగాణ ప్రభుత్వ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో డీఈడీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. పదో తరగతి పరీక్షల్లో 47 మంది గాను 33 మంది హాజరుకాగా, ఇంటర్ పరీక్షల్లో 41 మంది గాను 25 మంది హాజరయ్యారు. డీఈడీ పరీక్షలకు 54 మంది గాను 52 మంది హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ పరమేశ్వర్‌లు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

### ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ శ్రేణులు

దస్తురాబాద్: కేంద్రప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తంచేస్తూ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సోమవారం ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జీఎస్టీ భారం తగ్గించడంతో పేద, మధ్యతరగతి వారికి మేలు చేకూరిందని పార్టీ మండల అధ్యక్షుడు పానుగంటి రాజు పేర్కొన్నారు. పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్ లక్ష్మణ్, మండల ప్రధాన కార్యదర్శులు మల్లేశ్, రాజేందర్, నాయకులు చంచు భూమన్న, నరేశ్, గంగాధర్, హన్మగౌడ్, చారి, శ్రీనివాస్, రవి, పోషం తదితరులు పాల్గొన్నారు.

### సోన్ పీహెచ్‌సీ తనిఖీ



పరిసరాలు పరిశీలిస్తున్న రవీందర్‌నాయక్

సోన్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీపీహెచ్‌అండ్‌ఎఫ్‌డబ్ల్యూ (డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్) అధికారి రవీందర్‌నాయక్ సోమవారం తనిఖీ చేశారు. జాతీయ ఆరోగ్య విషయాలపై సమీక్ష చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని వైద్యులకు సూచించారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. ల్యాబ్, రికార్డులు, మందులు పరిశీలించారు. ఆస్పత్రి ఆవరణను పరిశీలించి సంతృప్తి వ్యక్త చేశారు. డీఎంహెచ్‌వో రాజేందర్, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి ఆశిశ్‌రెడ్డి, రాజా రమేశ్, స్థానిక వైద్యులు విజయ్‌కుమార్ ఉన్నారు.

## మాలలను అణచివేస్తున్న ప్రభుత్వం

నిర్మల్‌టౌన్: మాలలను అణచివేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని మాలమహానాడు సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల రంజిత్ అన్నారు. నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాలలపై ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు సరికాదన్నారు. సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్‌కు విరుద్ధంగా ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేసిందన్నారు. టీఎస్‌ఆర్టీసీ ఉద్యోగ నోటిఫికేషన్‌లో మాల ఉపకులాలకు కేవలం 28 ఉద్యోగులను కేటాయించడం అనేది మాలల ఉద్యోగ అవకాశాలను నీరుగార్చడమేనని పేర్కొన్నారు. రోస్టర్ పాయింట్లలో 22వ రోస్టర్ పాయింట్ మాలలకు కేటాయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మాలలపై తీసుకుంటున్న నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంటోల్ల వెంకటస్వామి, జిల్లా నాయకులు ఆకుల రమేశ్, సతీశ్, భూమేశ్, సిద్ధార్థ, శ్రీనివాస్, రత్నయ్య, పులి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బత్తుల రంజిత్

## శాంతియుతంగా దసరా జరుపుకోవాలి

నిర్మల్‌టౌన్: శాంతియుతంగా దసరా పండగను జరుపుకోవాలని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయంలో పూజలు నిర్వహించి, శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఒక్కరు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను సన్మానించారు. ఎఫ్ఎస్సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమారెడ్డి, నాయకులు మేడారం ప్రదీప్, లక్కాకుల నరహరి, చైతన్య, శ్రీకాంత్ యాదవ్, గంగారెడ్డి, శ్రీనివాస్, పివి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాజీమంత్రి అల్లోలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

## పార్‌పెల్లిలో స్వస్త్ నారి స్వశక్తి పరివార్'

లక్ష్మణచాంద: పార్‌పెల్లి గ్రామంలో సోమవారం స్వస్త్ నారి స్వశక్తి పరివార్' కార్యక్రమం చేపట్టారు. 8వ జాతీయ పోషణమాస ప్రారంభంలో భాగంగా ఆరోగ్య మహిళా శక్తివంతమైన కుటుంబ కార్యక్రమం చేపట్టారు. ఇందులోభాగంగా వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమం ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వ తేదీ వరకు జరుగుతుందన్నారు. డాక్టర్ ప్రత్యూష, ఆరోగ్య సహాయకుడు శివకృష్ణగౌడ్, పద్మావతి, ఉమ, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో 'స్వచ్ఛత హీ సేవా'

నిర్మల్‌టౌన్: స్వచ్ఛ సర్వేక్షణ్–2025లో భాగంగా జిల్లాకేంద్రంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని మహిళా సంఘాల సభ్యులకు తడి, పొడి, హానికర చెత్తపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛత ప్లేడ్జ్ చేపట్టారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు దేవిదాస్, ప్రవీణ్‌కుమార్, టీఎంసీ దత్తాద్రి, ఏడీ ఎంసీలు శివ, సురేశ్, మహిళా సంఘాల సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బతుకమ్మ సంబరాలు

తానూరులో బతుకమ్మతో మహిళలు



పార్డి(కె) గ్రామంలో..



గ్రామాల్లో సోమవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ప్రధాన కూడళ్ల వద్ద పెట్టారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ ఆడి పాడారు. అనంతరం చెరువులు, వాగుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

– భైంసారూరల్/ముధోల్/కుభీర్/తానూరు/ దస్తురాబాద్/కుంటాల

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బాసర: బాసరలో రెండురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు, ముంపు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పవన్‌చంద్ర ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కూలడానికి సిద్ధంగా ఉన్న పాత ఇళ్లలో ఉండవద్దని, గోదావరి నది పరివాహక ప్రాంతంలో జాలర్లు, పశువుల కాపర్లు అటువైపు వెళ్లొద్దని సూచించారు.

## సంక్షిప్తంగా

**విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలి**

కుభీర్/ముధోల్: లోకేశ్వరం మండలం రాయపూర్ కాండ్లిలో ఇటీవల బీరప్ప దేవుని విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలని మండల కుర్మ సంఘం నాయకులు సోమవారం కుభీర్‌లో అడిషనల్ ఎస్పీ అవినాష్, తహసీల్దార్ శివరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. కుర్మ సంఘం నాయకులు డి.బీరు, మాజీ ఉపసర్పంచ్ దత్తాత్రి, నాయకులు కామాజీ, బాలాజీ, నగేశ్, సాయినాథ్ తదితరులు ఉన్నారు.

- బీరప్ప ఆలయ శిఖరాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సోమవారం ముధోల్ గ్రామ అభివృద్ధి కమిటీ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీలతకు వినతిపత్రం అందజేశారు. గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు విఠల్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రమేశ్, మాజీ ఎంపీటీసీలు పోతన్నయాదవ్, దేవోజీ భూమేష్, మాజీ సర్పంచ్ అనిల్ పాల్గొన్నారు.

**జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలి**

ఖానాపూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీలు విశ్వబ్రాహ్మణులకు జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఫౌండర్ విశ్వనాథుల పుష్పగిరి అన్నారు. ఈనెల 17న ఆదిలాబాద్‌లో ప్రారంభమైన 1500 కిలోమీటర్ల పాదయాత్ర సోమవారం పట్టణంతో పాటు మండలంలోని మస్కాపూర్, సుర్జాపూర్, బాదనకుర్తి గ్రామాల్లో కొనసాగింది. 42 శాతం బీసీ రిజర్వేషన్లలో భాగంగా అన్ని పార్టీలు విశ్వబ్రాహ్మణులకు 4 నుంచి 5 శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. దేశరాజి వెంకటేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**లింబా(బి)లో గాజుల సవ్వడి**

కుంటాల: లింబా(బి) గ్రామంలో మహిళలు సోమవారం ఘనంగా గాజుల సవ్వడి కార్యక్రమాన్ని నిర్వహించారు. చేతులకు గోరింటాకు పెట్టుకుని, పసుపు, కుంకుమ వాయినంగా ఇచ్చిపుచ్చుకున్నారు. గాజులు వేసుకున్నాక ఫ్యాషన్ షో నిర్వహించారు. రోజంతా సరదాగా గడిపి సహపంక్తి భోజనాలు చేశారు.

**పిడుగుపాటుకు దెబ్బతిన్న శిఖరం**

మామడ: మండలంలోని కొరిటికల్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరాలయం శిఖరం, గోపురం సోమవారం కురిసిన భారీ వర్షం పిడుగుపాటుకు దెబ్బతిన్నాయి. మధ్యాహ్న సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో స్థానికులకు ఆలయం సమీపంలో భారీ శబ్దం వినిపించింది. ఆలయం పై ఉన్న శిఖరం పూర్తిగా, గోపురం, గోడలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అర్చకులు, వేదపండితుల సూచనలతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని శుద్ధిచేశారు.

**సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత**

భైంసారూరల్: కుభీర్ మండలంలోని పార్డి(బి) గ్రామానికి చెందిన తూము శ్రావణికి మంజూరైన రూ.20 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మండలంలోని దేగాం గ్రామంలోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సోమవారం బాధిత కుటుంబానికి అందించారు. నాయకులు దత్తురాం, మైపాల్‌రెడ్డి, గంగయ్య, మిలింద్ తదితరులు పాల్గొన్నారు.

**పాపహరేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే**

దిలావర్‌పూర్: మండలంలోని కదిలి శ్రీమాతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయంలో సోమవారం నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సతీసమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేక పూజలు చేశారు. అదేవిధంగా శ్రీమాతా అన్నపూర్ణేశ్వరి దేవిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఆలయ అధికారులు ఆయన్ను సన్మానించారు.

**విగ్రహ నిర్మాణానికి భూమిపూజ**

కుంటాల:లింబా(కె) గ్రామంలో పండుగ సాయన్న విగ్రహ నిర్మాణం కోసం సోమవారం భూమిపూజ చేశారు. ముదిరాజ్ సంఘం మండల ఉపాధ్యక్షుడు మెల్ల సాయిలు, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎర్రోళ్ల చిన్న రాజన్న, మాజీ సర్పంచులు సవ్వి అశోక్, ఆనంద్‌రావు పటేల్, మాజీ ఎంపీటీసీ గిరీశ్‌కుమార్, డైరెక్టర్ మహేందర్, వీడీసీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, సభ్యులు హన్మాండ్లు, శంకర్, భూమన్న, ముత్యం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**బీడీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి**

కుంటాల: బీడీ కార్మికుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధిరాం పేర్కొన్నారు. నిజామాబాద్‌లో అక్టోబర్ 11, 12, 13వ తేదీల్లో నిర్వహించే రాష్ట్ర ద్వితీయ మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం కుంటాలలో రాజ్ కమల్ బీడీ ఫ్యాక్టరీలో ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు ఈపీఎఫ్, పెంచిన పెన్షన్ వేతనం ఇవ్వాలని, జీఎస్టీ 28 శాతం నుంచి 40 శాతం వరకు పెంచిందన్నారు. బీడీ ప్యాకర్లు రమేశ్, చిన్నయ్య, సాయినాథ్, నర్సయ్య, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఓటరు జాబితాపై సమీక్ష**

దస్తురాబాద్: తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితాపై బీఎల్వోలతో సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విశ్వంబర్ మాట్లాడుతూ బీఎల్వోలు తమ బూత్ పరిధిలో ఓటరు జాబితాలో మృతిచెందిన వారిని తొలగించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ యాదవరావ్, సీనియర్ అసిస్టెంట్ సంతోష్, ఆర్‌ఐలు రచన, ఆర్తి, జేపీవోలు, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

**వైద్యశిబిరం సద్వినియోగం చేసుకోవాలి**

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్ కాలనీలో ఐశ్వర్య చిన్నపిల్లల ఆస్పత్రిలో వారం రోజుల పాటు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ మాజీ చైర్మన్ చిన్నం సత్యం కోరారు. పట్టణంలోని ఆస్పత్రిలో కొనసాగుతున్న ఉచిత ఓపీ శిబిరాన్ని సోమవారం సందర్శించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని చిల్డ్రన్స్ స్పెషలిస్ట్ గడ్డం చంద్రకిరణ్ ఆధ్వర్యంలో చిన్నపిల్లల వైద్యశిబిరాన్ని నిర్వహించడం పట్ల అభినందించారు.

**ఘనంగా చాంద మహంకాళి పండుగ**

ఖానాపూర్: పాత ఎల్లాపూర్‌లో సోమవారం చాంద మహంకాళి పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాంద మహంకాళిని గ్రామం పొలిమేర నుంచి గ్రామ శివారు వరకు డప్పుచప్పుళ్ల మధ్య తరలించారు. ప్రతీ ఏటా సంప్రదాయబద్ధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

**క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది**

ఖానాపూర్: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ పేర్కొన్నారు. పెంబి మండలకేంద్రంలో ఈ నెల 24 నుంచి చేపట్టనున్న పెంబి సూపర్ స్ట్రైకర్స్, రెయిన్‌బో వారియర్స్ క్రీడా జట్ల టీషర్ట్‌లను ఖానాపూర్‌లోని బీఆర్‌ఎస్ క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల ఎంబీబీఎస్ సీటు సాధించిన పెంబితండా మాజీ సర్పంచ్ కరుణ–విలాస్ దంపతుల కూతురు చందనను సన్మానించారు. పెంబి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గంగారెడ్డి, ఖానాపూర్ మాజీ వైస్ ఎంపీపీ వాల్‌సింగ్, పెంబి మాజీ సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్, క్రీడాకారులు నరేశ్, మతీన్ ఉన్నారు.

**పిడుగుపాటుకు ఎద్దు మృతి**

లక్ష్మణచాంద: మండలంలో సోమవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి ఉరుములు, మెరుపులతోపాటు పిడుగులు పడ్డాయి. బోరిగాం గ్రామానికి చెందిన మెరుగు నారాయణ తన ఎద్దులను గ్రామ సమీపంలో మేతకు తీసువెళ్లి అక్కడ ఉంచారు. ఎద్దుపై పిడుగుపడటంతో ఒక ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. పిడుగుపాటుకు పొట్టపెల్లి(కే) గ్రామంలో తూర్పు భూమన్న ఇంటి ముందు వేప చెట్టు చెరడు లేచిపోయింది.

**పాముకాటుతో ఆవు..**

కుంటాల: అందకూర్ శివారులో సోమవారం డెయిరీ ఫాంలో కట్టివేసి ఉంచిన ఆవుకు పాముకాటు వేయడంతో అక్కడికక్కడే మృతిచెందింది. దీని విలువ రూ.80 వేలు ఉంటుందని, నష్టపరిహారం అందించాలని బాధిత రైతు రవి కోరాడు.

**కడెంకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో**

కడెం: కడెం ప్రాజెక్ట్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమవారం ప్రాజెక్ట్‌కు 7709 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో అధికారులు ఒక వరద గేటు ద్వారా 5294 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 698.825 అడుగులుగా ఉంది.